సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో 22.502 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శనివారం నాటికి 22.502 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 9,995 క్యూసెక్కుల వంతున వరద కొనసాగుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60,880
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,485
3శాతం జీఎస్టీతో	రూ.5,650
నవర (8గ్రా)	రూ.45,200

గరిష్టం/కనిష్టం
37.9 /28.5

వాతావరణం

వాతావరణంలో తేమ 48 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా ఆదివారం కొన్ని మండలాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

దోచాడు.. దొరికాడు!



- పలువురు టీడీపీ నేతల హౌస్ అరెస్ట్
- నిరసనలకు ముఖం చాటేసిన పార్టీ శ్రేణులు
- నెల్లూరులో యథావిధిగా సాగిన కార్యకలాపాలు
- ఆర్టీసీ బస్సులను నిలిపివేసిన అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు

తమ్ముళ్లలో కనిపించని స్పందన

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ప్రతిపక్ష నేత, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడును శనివారం ఉదయం అరెస్ట్ చేసిన నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. టీడీపీ కీలక నేతలను ఇళ్లకే పరిమితం చేశారు. పార్టీ అధినేత అరెస్ట్‌పై టీడీపీ శ్రేణులు సైతం పెద్దగా ఆసక్తి చూపక నిరసన కార్యక్రమాలకు ముఖం చాటేశారు. దీంతో జిల్లాలో కార్యకలాపాలు యథావిధంగా కొనసాగాయి. ఆర్టీసీ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బస్సులను నిలిపివేశారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు యువతకు నైపుణ్యాభివృద్ధి పేరుతో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా భారీ అవినీతికి పాల్పడ్డారు. ప్రముఖ సీమెన్స్ కంపెనీతో ఒప్పందం చేసుకుని ఆ కంపెనీకి సంబంధం లేకుండానే దాదాపు రూ.371 కోట్లు దారిమళ్లించారు. ఈ స్కాంలో నిందితుడిగా చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్ట్ చేయడంతో జిల్లా వ్యాప్తంగా ఆయన అవినీతి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాను నిప్పు అంటూ చెప్పుకునే చంద్రబాబు కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని దారి మళ్లించిన వైనాన్ని సీఐడీ అధికారులు నిర్ధారించారు. చంద్రబాబు అవినీతి భాగోతం బట్టబయలు కావడంతో టీడీపీ క్యాడర్ సైతం అవాక్కైంది.

నామమాత్రంగా నిరసనలు..

జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ప్రజలు చంద్రబాబు అరెస్టను అంత సీరియస్‌గా తీసుకోలేదు. రోజువారీ కార్యకలాపాలు కూడా సాఫీగా జరిగాయి. టీడీపీ నేతలు అక్కడక్కడ నిరసనలు తెలిపేందుకు ప్రయత్నించినా క్యాడర్ ముందుకు రాలేదు. దీంతో నలుగురు లేదా ఐదుగురితోనే రోడ్డుపై నిరసనలు తెలిపారు. టీడీపీ కార్యకర్తలు కూడా ముఖం చాటేయడంతో నిరసనల కార్యక్రమాలు విజయవంతం కాలేదు.

పోలీస్ ముందస్తు చర్యలు..

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా పోలీస్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్‌ను అమలు చేశారు. నంద్యాల జిల్లాలో చంద్రబాబును అరెస్ట్ చేసిన వెంటనే టీడీపీ కీలకనేతల ఇళ్ల వద్దకు చేరుకున్న పోలీసు సిబ్బంది వారిని ఇంటి నుంచి బయటకు రాకుండా చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తదితరులను హౌస్ అరెస్ట్ చేశారు.

ఆర్టీసీ బస్సుల నిలిపివేత

ఆర్టీసీకి ఎలాంటి నష్టం జరగకుండా ఉండేందుకు జిల్లా వాప్తంగా బస్సులను ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. బస్సులను నష్టపరిచే అవకాశం ఉందని పోలీసులు సమాచారం ఇవ్వడంతో మధ్యాహ్నం వరకు సర్వీసులను నిలిపివేశారు. నెల్లూరు-1, 2, రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు డిపోల్లో సర్వీసులను నిలిపి వేశారు. మధ్యాహ్నం నుంచి సర్వీసులను యథావిధిగా కొనసాగించారు.

పోలీసులపై రెచ్చిపోయిన కోటంరెడ్డి

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మరోసారి పోలీసులపై దురుసుగా ప్రవర్తించాడు. చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో ఆయన నివాసానికి చేరుకున్న నెల్లూరు పోలీసులు హౌస్ అరెస్ట్ కోసం లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా తన అనుమతి లేకుండా లోనికి ఎలా వస్తారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన పోలీసులపై దురుసుగా ప్రవర్తించడం విమర్శలకు తావిచ్చింది.

దోపిడీ సామ్రాజ్యానికి చక్రవర్తి చంద్రబాబు



కావలి: రాష్ట్రాన్ని దోచుకునేందుకు పటిష్టమైన నెట్‌వర్క్‌తో సువిశాల సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న చంద్రబాబు దోపిడీ సామ్రాజ్యానికి చక్రవర్తి అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన కావలిలో విలేకరులతో మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు అనేక కుంభకోణాలకు పాల్పడ్డారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్, అమరావతి రింగ్‌రోడ్డు..ఇలా అనేక వాటిలో అవినీతికి పాల్పడి రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టాన్ని చేకూర్చాడని ఆరోపించారు. స్కిల్‌డెవలప్‌మెంట్‌కు సంబంధించి రూ.371 కోట్లను ప్రైవేట్ కంపెనీకి బదిలీ చేసి షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు దోచేసినట్లు దర్యాప్తులో గుర్తించిన సీఐడీ అరెస్ట్ చేసిందన్నారు. చంద్రబాబు అక్రమాలు ఇంకా వెలుగులోకి రానున్నాయన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంటే చంద్రబాబు అరెస్టను టీడీపీ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూడడం సిగ్గుచేటు అన్నారు.

అరెస్ట్‌లో రాజకీయ కోణం లేదు



నెల్లూరు(దర్గామిట్ట): చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఇందుకు ఎవరూ మినహాయింపు కాదని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన నెల్లూరులో తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో మాజీ సీఎం చంద్రబాబునాయుడు ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంపై సుదీర్ఘంగా విచారణ జరిపిన సీఐడీ అధికారులు చంద్రబాబును నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారని తెలిపారు. చంద్రబాబు అరెస్ట్‌లో కక్ష సాధింపు ఏమి లేదన్నారు. టీడీపీ నేతలకు కుంభకోణం గురించి తెలిసినప్పటికీ కావాలనే రాజకీయం చేస్తున్నారన్నారు. చంద్రబాబు అరెస్ట్‌లో రాజకీయ కోణం ఏమి లేదని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంతోనే అరెస్ట్ చేయడం జరిగిందన్నారు.

పాపం అనుభవించాల్సిందే



కోవూరు: ప్రజా నాయకుడైన ఎన్టీ రామారావుపై చెప్పులు వేయించి ఆయన్ని మానసిక క్షోభకు గురిచేసిన పాపాన్ని చంద్రబాబునాయుడు అనుభవించాల్సిందేనని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో బాబు అరెస్ట్ విషయంలో సీఐడీ నిష్పక్షపాతంగా వ్యవరించిందన్నారు. ఇందులో ఎవరి ఒత్తిడి లేదన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ స్కాంపై 2021లోనే కేసు నమోదైందని చెప్పారు. అప్పట్నుంచి సీఐడీ అధికారులు విభిన్న కోణాల్లో విచారణ జరిపి చంద్రబాబునాయుడును నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారని తెలిపారు. ఎన్టీ రామారావుపై చంద్రబాబునాయుడు అన్యాయంగా చెప్పులు వేయించిన ఘటన ప్రజలకు గుర్తుందన్నారు. ఆ పాపం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు అనుభవిస్తారన్నారు.

నిరుద్యోగులను మోసం చేశారు



నెల్లూరు(సెంట్రల్): స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబు ప్రజాధనాన్ని దోచుకుని నిరుద్యోగులను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన నెల్లూరులోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు దాదాపు రూ.371 కోట్లను దోచుకున్న విషయం సీఐడీ విచారణలో తేలిందన్నారు. చంద్రబాబు అరెస్ట్ విషయంలో సీఐడీ చట్టం ప్రకారం నడుచుకుందన్నారు. చట్టం తనపని తాను చేసుకుపోతుంటే టీడీపీ నాయకులు రాజకీయ లబ్ధిపొందాలని చూడడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు తప్పు చేశారా..లేదా అనేది కోర్టులో రుజువు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం కక్ష్య సాధింపులకు పాల్పడుతోందని తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు.

చంద్రబాబు పాపం పండింది



ఉదయగిరి: టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు పాపం పండిందని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడినా ఇప్పటి వరకు వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ చట్టానికి దొరకకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ఆయన పాపాలను దేవుడు సహించలేక స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం ద్వారా వెలుగులోకి తెచ్చారన్నారు.

రూ.75 లక్షల విలువైన

భూమి కబ్జా

- కౌలుకు తీసుకుని ఆక్రమణ
- మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి ప్రధాన అనుచరుడి నిర్వాకం
- బాధిత మహిళల ఫిర్యాదుతో చీటింగ్ కేసు నమోదు



నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి

కోవూరు/బుచ్చిరెడ్డిపాళెం: టీడీపీ మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రధాన అనుచరుడిగా చలామణి అవుతున్న నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి ఆక్రమణలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ఇద్దరు మహిళలకు వంశపారంపర్యంగా వచ్చిన రూ.75 లక్షల విలువైన మూడెకరాల భూమిని లీజుకు తీసుకుని ఆక్రమించాడు. బాధిత మహిళలు పోలీసులను ఆశ్రయించడంతో చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాలు..బుచ్చిరెడ్డిపాళెం మండలం కట్టుబడిపాళేనికి చెందిన కాకుమాను కృష్ణకుమారి, కాకుమాను మాధురిదేవికు సర్వే నంబర్ 1023-ఏ,బీ, 1024-ఏ,బీ, 512-1బీ,బీ సర్వే నంబర్లలో మూడెకరాల భూమి ఉంది. వంశపారంపర్యంగా వచ్చిన ఈ భూమిని అదే ప్రాంతానికి చెందిన నెల్లూరు ప్రభాకర్‌రెడ్డికి కౌలుకు ఇచ్చారు. గత కొన్నేళ్లుగా పొలం యజమానులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఇదే అదనుగా భావించిన నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి భూమిని ఎలాగైనా సొంతం చేసుకోవాలని కౌలు చెల్లించలేదు. భూమిని అప్పగించాలని కోరిన భూ యజమానులను బెదిరింపులకు గురిచేయసాగాడు. మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి అనుచరుడిగా చెలామణి అవుతూ రెవెన్యూ అధికారులను బ్లాక్‌మెయిల్ చేసి రెవెన్యూ రికార్డుల్లో సైతం తన తల్లి నెల్లూరు మీనాక్షమ్మ పేరును నమోదు చేయించుకున్నారు. ఇదేమి అన్యాయం అని ప్రశ్నించిన బాధితులను బెదిరించడంతో బాధితులు ఇటీవల రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. దీంతో బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దార్ ఈ నెల 16న విచారణకు హాజరు కావాలని నెల్లూరు ప్రభాకర్‌రెడ్డికి శనివారం నోటీసులు జారీ చేశారు. అలాగే బాధితుల ఫిర్యాదు మేరకు బుచ్చిరెడ్డిపాళెం ఎస్సై వీరప్రతాప్ సైతం చీటింగ్ కేసు నమోదు చేశారు.

టెక్నాలజీతో ఏ దేశంలోనైనా రాణించొచ్చు



జ్యోతిప్రజ్వలన చేసి విద్యాసదస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

- విద్యా సదస్సులో పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

నెల్లూరు (పొగతోట) : ఆంగ్లం, నూతన టెక్నాలజీపై పూర్తిస్థాయిలో పట్టు సాధిస్తే ఏ దేశంలోనైనా రాణించొచ్చునని పాఠశాలల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ విద్యార్థులకు సూచించారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విద్యా సదస్సులో ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. పాఠశాల దశ నుంచే విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి విద్యార్థి ఆంగ్లంలో మాట్లాడడం అలవర్చుకోవాలన్నారు. పట్టుదల, నమ్మకం, ఏకాగ్రత ఉంటే కలలను సాకారం చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేలా ప్రభుత్వం విద్యా విధానంలో నూతన మార్పులను తీసుకొస్తోందన్నారు. దీంతో విద్యార్థులు పోటీ పరీక్షల్లో సులభంగా రాణించగలరన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్ని అవకాశాలు లేవన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. రాష్ట్రంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని తొలిసారిగా నెల్లూరు జిల్లాలోనే నిర్వహించడం సంతోషకరమన్నారు. జూనియర్ టోఫెల్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధిస్తే ప్రపంచంలో ఏ దేశాలకు వెళ్లినా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేయలేదన్నారు. రాష్ట్రంలోనే విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసి బైజూస్ ద్వారా పాఠ్యాంశాలను అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతోందని తెలిపారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తోందని వివరించారు. 8వ తరగతి నుంచి సీబీఎస్‌ఈ విద్యావిధానాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. విద్యాసదస్సును జిల్లాలో నిర్వహించడం సంతోషకరంగా ఉందని, ఉన్నతాధికారుల సూచనలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదువుకుంటూ ముందుకు అడుగులు వేస్తే ఉన్నత ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఈ సదస్సులో విద్యాశాఖ జేడీ రామలింగం, ఆర్జేడీ సుబ్బా రావు, డీఈఓ గంగాభవానీ, ఏపీసీ ఉషా రాణి, ఎస్‌సీఈఆర్‌టీ సుధా, అపర్ణ, రమేష్,తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 19,468 కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న అదనపు జిల్లా జడ్జి కపర్ది

నెల్లూరు (లీగల్): జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ యామిని పర్యవేక్షణలో ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 19,468 కేసులను పరిష్కరించారు. బాధితులకు రూ.1,14,43,556 నగదును అందజేశారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా భవన్‌లో మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జీ కపర్ది జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. కక్షిదారులు రాజీపడి వస్తే లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తారని తెలిపారు. కక్షిదారులు కోర్టులు చుట్టూ తిరిగి సమయం, నగదును వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నెల్లూరులో ప్రత్యేకంగా ఆరు బెంచ్‌లను ఏర్పాటు చేశారు. న్యాయమూర్తులు జీ కపర్ది, కే వాణి, పీ భరద్వాజ, ఎస్ లావణ్య, జీ దేవిక, పీ వినోద్ ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి 7,152 కేసులను పరిష్కరించారు. అలాగే వివిధ కోర్టులకు సంబంధించి గూడూరు 3046, కోవూరు 2656, కావలిలో 1110, వెంకటగిరి 2248, కోట 1182, నాయుడుపేట 76, సూళ్లూరుపేట 999, ఆత్మకూరు 1189, ఉదయగిరి 210 కేసులను పరిష్కరించారు. కాగా రాష్ట్రంలో లోక్‌అదాలత్ కేసుల పరిష్కారంలో నెల్లూరు ద్వితీయ స్థానంలో నిలిచింది.

వృత్తిలో నిబద్ధతతో పనిచేయండి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య

నెల్లూరు (లీగల్): న్యాయవాద వృత్తిలో జూనియర్ న్యాయవాదులు నిబద్ధతతో పనిచేయాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ నైనాల జయసూర్య పేర్కొన్నారు. నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని అనిల్‌గార్డెన్స్‌లో శనివారం దివంగత సీనియర్ న్యాయవాదుల చిత్రపటాల ఆవిష్కరణ, సీనియర్ న్యాయవాదులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు, దివంగత న్యాయవాదులను జూనియర్లు ఆదర్శంగా తీసుకుని వృత్తిలో రాణించాలని సూచించారు. 50 ఏళ్ల న్యాయవాద వృత్తిని పూర్తి చేసుకున్న న్యాయవాదులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. మరో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే మన్మథరావు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదుల చిత్రపటాల ఆవిష్కరణ కార్యక్రమానికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. దివంగత సీనియర్ న్యాయవాదుల ఆశయాలను జూనియర్ న్యాయవాదులు కొనసాగించాలని కోరారు. అనంతరం నెల్లూరుకు చెందిన సీనియర్ న్యాయవాదులు పదిహేను మందిని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కే సురేష్‌రెడ్డి, జస్టిస్ మన్మథరావు, జస్టిస్ జయసూర్యలు శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా జడ్జి సీ యామిని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ సుందరయ్య యాదవ్, న్యాయవాదులు పాల్గొన్నారు.


బాలిక మృతి కేసులో వీడని మిస్టరీ..?

- గత నెల 30న జువ్వలదిన్నె తీరంలో లభించిన మృతదేహం
- పదిరోజులు గడిచినా కొలిక్కిరాని దర్యాప్తు



జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో లభ్యమైన బాలిక మృతదేహం (ఫైల్)

బిట్రగుంట: బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో గత నెల 30న అనుమానాస్పద స్థితిలో లభ్యమైన పదేళ్ల బాలిక మృతి కేసు మిస్టరీగా మారింది. పది రోజులు గడిచినా కేసు దర్యాప్తులో పురోగతి కనిపించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత నెల 30న వేకువన ఫిషింగ్ హార్బర్ సమీపంలో సముద్రంలో బాలిక మృతదేహాన్ని స్థానిక మత్స్యకారులు గుర్తించిన విషయం తెలిసిందే. బాలిక పెదవులు, మొహం నీలిరంగులో మారి ఉండడం, ముక్కు నుంచి నురగ వచ్చి ఉండడం మినహా ఎటువంటి దెబ్బలు, చేపలు కొరికిన గాయాలు లేకపోవడంతో ఘటన జరిగిన కొద్ది గంటల్లోనే మృతదేహం వెలుగుచూసినట్లుగా భావించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి చేతులు దులుపుకొన్నారు. బాలిక ఎవరనేది తెలిస్తే మృతికి గల కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నా ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. జిల్లాతో పాటు సమీప జిల్లాల్లో నమోదైన మిస్సింగ్ కేసులు, వలస కార్మికుల వివరాలను కూడా పూర్తిస్థాయిలో పరిశీలించలేదనే విమర్శలు ఉన్నాయి. ఫిషింగ్ హార్బర్‌తో పాటు రామాయపట్నం పోర్టు నిర్మాణానికి ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కూలీలు వచ్చి ఉన్నారు. వీరికి సంబంధించి కూడా ఎవరైనా కనిపించకుండా పోయారా అనే కోణంలో కూడా దర్యాప్తు ముందుకు సాగలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాలిక ప్రమాదవశాత్తు సముద్రంలో పడి చనిపోతే తప్పనిసరిగా తల్లిదండ్రులు మిస్సింగ్ కేసు నమోదు చేసి ఉండేవారు. ఎక్కడా మిస్సింగ్ కేసు నమోదవకపోవడం, బాలిక తల్లిదండ్రుల జాడా లేకపోవడంతో అంతా మిస్టరీగా మారింది. పోలీసులు ప్రాథమిక వివరాల పరిశీలనలో విఫలం కావడంతో పాటు సాంకేతిక ఆధారాల సేకరణకు ఎటువంటి ప్రయత్నాలు చేసినట్లుగా కనిపించడం లేదు. ఎక్కడో చనిపోతే ఇక్కడికి కొట్టుకొచ్చిందంటూ కేసును పక్కన పెట్టేసినట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై బిట్రగుంట ఎస్సై శేఖర్‌బాబును సంప్రదించగా మృతి చెందిన బాలికకు సంబంధించి ఇంకా ఎటువంటి వివరాలు లభ్యం కాలేదని తెలిపారు. రాష్ట్రంలో మిస్సింగ్ కేసులకు సంబంధించిన వివరాలు అన్నీ పరిశీలించినా ఎటువంటి సమాచారం సరిపోలేదన్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత మృతికి కారణాలు తెలిసే అవకాశం ఉందని తెలిపారు.



నిమ్మధరలు
పొదలకూరు (కిలో)
పెద్దవి: రూ. 65
సన్నవి: రూ. 40
పండ్లు: రూ. 10

నెల్లూరు
పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్ :	రూ.150
లేయర్ లైవ్ :	రూ.110
బ్రాయిలర్ చికెన్ :	రూ.256
స్కిన్‌లెస్ చికెన్ :	రూ.284
లేయర్ చికెన్ :	రూ.187

ముగిసిన వైద్య విద్యార్థుల విహంగ-23

- పది మంది విద్యార్థులకు బంగారు పతకాలు
- తొలి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండ్రోజుల పాటు నిర్వహించిన విహంగ-23 కార్యక్రమం శనివారంతో ముగిసింది. కళాశాల ప్రిన్సిపల్ జమున, సూపరింటెండెంట్ నరేంద్ర ఆధ్వర్యంలో వైద్యవిద్యలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కష్టపడి చదివి రాష్ట్రంలోనే కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. పేదలకు ఉత్తమ సేవలందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. అనంతరం మెడికల్ కళాశాలలో చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. నూతనంగా చేరిన విద్యార్థులకు ప్రిన్సిపల్ జమున ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



క్రీడల్లో పతకాలు అందుకున్న విద్యార్థులు

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.

సాక్షి ఫ్యామిలీ
నెల్లూరు
ఆదివారం ॥ 10-9-2023

వైరల్




గ్రీన్ సిగ్నల్

పట్టణాల్లోని చిన్న అపార్ట్‌మెంట్‌వాసుల నోటి నుంచి తరచుగా వినిపించే మాట 'మొక్కలు అంటే మాకు చాలా ఇష్టం. కాని స్థలం ఎక్కడిది?'

'స్థలం పెద్దగా అక్కర్లేదు. పెంచాలనే సంకల్పం ఉంటే చాలు' అంటుంది బిహార్‌కు చెందిన కమల్‌సింగ్.

ఉద్యోగ నిమిత్తం బెంగళూరులో ఉంటున్న కమల్‌సింగ్ తన చిన్న అపార్ట్‌మెంట్ బాల్కనీలో రకరకాల మొక్కలు పెంచుతుంది.

'వంటగది వ్యర్థాలతో కంపోస్ట్‌ను ఎలా తయారు చేయాలి?' అనే విషయం నుంచి ఏ మొక్కలను ఎలా పెంచాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వరకు... ఎన్నో విషయాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తోంది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ పేజీ 'అర్బన్ హోమ్ వైబ్స్'కు ఎంతోమంది ఫాలోవర్స్ ఉన్నారు.

'స్టార్ట్ వేర్ యూ ఆర్ విత్ వాటెవర్ యూ హ్యావ్' అంటున్న కమల్‌సింగ్ స్ఫూర్తితో ఎంతో మంది పట్టణ వాసులు తమ బాల్కనీలో మొక్కల పెంపకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి 'మేము సైతం' అంటున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి


మలాలాతో మహ్నూర్

పదహారు సంవత్సరాల బ్రిటీష్-పాకిస్థానీ మహ్నూర్ ఛీమ లండన్‌లోని జనరల్ సర్టిఫికేట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (జీసీఎస్‌ఈ) లెవెల్‌లో 34 సబ్జెక్‌లలో టాప్ గ్రేడ్ సాధించి రికార్డ్ సృష్టించింది. గణిత శాస్త్రం, ఖగోళశాస్త్రంలాంటి శాస్త్రాలు, ఫ్రెంచ్, లాటిన్... మొదలైన భాషలలో అద్భుతమైన ప్రతిభ చూపుతుంది మహ్నూర్. ఆమె ఎంచుకున్న 34 సబ్జెక్ట్‌లలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, లిటరేచర్, ఫిల్మ్ స్టూడియోస్, సైకాలజీ... మొదలైన సబ్జెక్ట్‌లు ఉన్నాయి.

'ఇది మహ్నూర్‌కు మాత్రమే పరిమితమైన విజయం కాదు. ఈతరంలో ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే విజయం' అని ట్వీట్ చేశారు పాక్ మాజీ ప్రధాని షెహబాజ్ షరీఫ్.

'వైద్యురాలిగా పదిమందికి సేవ చేయాలి' అనేది తన జీవిత ఆశయంగా చెబుతుంది మహ్నూర్.

ఇదిగో సారూ... నా మేక టికెటు



గ్రామీణ ప్రాంతాల్లో పెంపుడు జంతువులను కుటుంబసభ్యులుగా చూసుకుంటారు. పేర్లు పెట్టి ప్రేమగా పిలుచుకుంటారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఒక మహిళ మేకను పెంచుకుంటుంది. ఒకరోజు ఆమె వేరే ఊరికి పోవాల్సి వచ్చింది. మేకను ఇంట్లో ఒంటరిగా విడిచిపెట్టడం ఇష్టం లేక తనతో పాటు తీసుకెళ్లింది. విశేషం ఏమిటంటే మేకకు కూడా ట్రెన్ టికెట్ తీసుకుంది. ఐఏఎస్ అధికారి అవినాష్ శరణ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ వైరల్ అయింది.

'తన మేకకు కూడా టికెట్ తీసుకున్న విషయాన్ని టీటీయితో ఎంత గర్వంగా చెబుతుందో చూడండి' అని రాశారు అవినాష్.

ఇక వీడియో క్లిప్ విషయానికి వస్తే... టికెట్ చూపించమని ఆమెను టీటీయి అడుగుతాడు. 'ఇదిగో' అంటూ చూపిస్తుంది.

'నీ సంగతి సరే, మరి మేకకు టికెట్ తీసుకున్నావా?' అని సరదాగా అడుగుతాడు టీటీయి.

'అమ్మో...తీసుకోకుండా ఎలా ఉంటాను. ఇదిగో టిక్కెట్టు' అని చూపిస్తుంది.

'నేను తరచుగా రైల్లో ప్రయాణిస్తుంటాను. టికెట్ లేకుండా ట్రెన్‌లో ప్రయాణించి టీటీయికి దొరికి పోయేవారిని చాలామందిని చూస్తుంటాను. వారిని గుర్తు తెచ్చుకున్నప్పుడు ఈమె చాలా గొప్పగా అనిపిస్తుంది' అని ఒక యూజర్ స్పందించాడు.

కాలం కలిసి వస్తే డంప్‌యార్డ్ కూడా నందనవనం అవుతుంది!



కాలం కలిసే వస్తే... కంపు కొట్టే డంపు యార్డ్ కూడా కనుల విందు చేసే పార్క్ అవుతుంది. రాజస్థాన్‌లోని రాజ్‌గఢ్‌లో ఒక డంప్ యార్డ్ ఉండేది. దుర్వాసన వల్ల ఆ చుట్టుపక్కల నుంచి నడిచి వెళ్లాలంటే జనాలు జడుసుకునేవారు. అలాంటి చోటుకు ఇప్పుడు జనాలు వెదుక్కుంటు వస్తున్నారు. దీనికి కారణం ఈ డంప్‌యార్డ్‌ను మున్సిపాలిటీ సిబ్బంది అందమైన పార్క్‌గా తయారుచేయడమే.

వాటర్ ఫౌంటెన్‌లు, పచ్చటి గడ్డితో ఈ పార్క్ కనువిందు చేస్తోంది.

ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్ సవిత దాహియా ఈ క్లిప్‌ను ట్విట్టర్‌లో షేర్ చేశారు.

'ఎన్నో పట్టణాలలో ఎన్నో డంప్‌యార్డ్‌లు భయపెడుతున్నాయి. అవి కూడా ఇలాగే నందనవనంలా మారితే ఎంత బాగుంటుంది' అంటూ ఒక ఎక్స్ యూజర్ స్పందించాడు.

కథక్ నుంచి తీన్మార్ వరకు




బెల్జియన్ కంటెంట్ క్రియేటర్ ఈడీ పీపుల్ వివిధ ప్రాంతాలలో లోకల్స్‌తో కలిసి చేసే డ్యాన్స్ వీడియోలు ప్రపంచ వ్యాప్తంగా ఫేమ్ అయ్యాయి. ఏదైనా ప్రాంతానికి వెళ్లిన పీపుల్ స్థానికులను 'మీకు ఇష్టమైన డ్యాన్స్ ఏమిటి?' అని అడగడమే కాదు 'నాకు నేర్పించగలరా?' అని రిక్వెస్ట్ చేసి ఓపిగ్గా నేర్చుకుంటాడు.

అలా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లను నేర్చుకుంటూ, స్థానికులతో పోటీ పడి డ్యాన్స్ చేస్తుంటాడు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.

తాజాగా మన దేశానికి సంబంధించి వివిధ ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లు చేసి 'వారేవా' అనిపించుకున్నాడు.

'మీ డ్యాన్స్ చూస్తుంటే భారతీయ పౌరసత్వం ఇవ్వాలనిపిస్తుంది'

'మా దేశంలోని కొన్ని అద్భుతమై డ్యాన్స్‌లను మిస్ అయ్యారు. వాటిని కూడా చేస్తే బాగుంటుంది' అంటూ వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఈడీ పీపుల్ షేర్ చేసిన డ్యాన్స్ వీడియోలపై నెటిజనులు స్పందించారు.

అటు చూస్తే జవాన్ ఇటు చూస్తే ఆఫీస్...



అటు చూస్తే బాదం హల్వా ఇటు చూస్తే సేమ్యా ఇడ్లీ... అని శ్రీశ్రీ అన్నట్టుగా ఆ బెంగుళూరు ఐ.టి ఉద్యోగికి కూడా సంకటం వచ్చింది. ఒకవైపు జవాన్ రిలీజ్. మరోవైపు సాఫ్ట్‌వేర్ డ్యూటీ. చివరకు అతను రెండూ చేశాడు. వైరల్ అయ్యాడు.

బెంగళూరులోనే ఇటువంటివి జరుగుతుంటాయి. మొన్నా మధ్య ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ర్యాపిడో బైక్ వెనుక కూచుని ఆఫీస్‌కు వెళుతూ ట్రాఫిక్‌లో చిక్కుకుపోతే బైక్ మీదే ల్యాప్‌టాప్ తెరిచి లాగిన్ అయ్యి డ్యూటీ మొదలెట్టేశాడు. భారీ ట్రాఫిక్ వల్ల క్యాబుల్లో ఎక్కగానే ల్యాప్‌టాప్‌లు తెరిచే వాళ్లూ అక్కడ ఎక్కువే. ఇప్పుడు ఒక ఉద్యోగి ఏకంగా సినిమా హాల్లోనే ల్యాప్‌టాప్ తెరిచాడు. ఏం చేస్తాడు మరి? షారూక్ ఖాన్ ఫ్యాన్. ఫస్ట్ డే ఫస్ట్ షో. సరిగ్గా ఆ టైమ్‌కే లాగిన్ అవ్వాలి. అందుకని థియేటర్‌లో ల్యాప్‌టాప్‌లో వేళ్లు టిక్కుటక్కుమంటుంటే కళ్లు సినిమాకు అంకితం అయ్యాయి. వెనుక కూచున్న ఒక వ్యక్తి ఇది ఫొటో తీసి ఇన్‌స్టాలో పెడితే లక్షల కొద్దీ వ్యూస్ వచ్చాయి. 'బెంగళూరులో ఇక పని చేయకుండా వదిలేసిన చోటు ఏదీ లేదు' అని కామెంట్లు చేస్తూ ఏడవ లేక నవ్వుతున్నారు.

హెల్త్



చాలారకాల వైరల్ జ్వరాల్లాగే డెంగీ కూడా తనంతట తానే తగ్గిపోయే (సెల్ఫ్ లిమిటింగ్) వ్యాధి. అయితే కొంత మందిలో మాత్రం ప్లేట్‌లెట్లు ప్రమాద స్థాయి కంటే కిందికి పడిపోతాయి. అది మినహా చాలావరకు డెంగీ నుంచి దాదాపుగా అందరూ కోలుకుంటారు. పైగా ఇది వైరల్ జ్వరం కావడంతో కేవలం లక్షణాలకు మాత్రమే చికిత్స చేస్తూ... ప్లేట్‌లెట్ కౌంట్‌ను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఇటీవల పెద్దసంఖ్యలో ఈ కేసులు వస్తున్న నేపథ్యంలో డెంగీపై అవగాహన కోసం ఈ కథనం.

డెంగీ నివారణ ఇలా...!

డెంగీలో రకాలు

డెంగీ రకాలను ఈ కింది విధంగా పేర్కొనవచ్చు. అవి... ఏ హెచ్చరికలూ లేకుండా వచ్చే డెంగీ (**డెంగీ విదవుట్ వార్నింగ్ సైన్స్**) ; కొన్ని హెచ్చరికలతో వచ్చే డెంగీ (**డెంగీ విత్ వార్నింగ్ సైన్స్**) ; తీవ్రమైన డెంగీ (**సివియర్ డెంగీ**)

లక్షణాలు

హెచ్చరికలు లేకుండా అకస్మాత్తుగా వచ్చే డెంగీ : డెంగీ ఎండెమిక్ ప్రాంతాల్లో... అంటే డెంగీ ఎక్కువగా వస్తున్న ప్రాంతంలో ఇది కనిపిస్తుంటుంది. వీళ్లలో జ్వరం, వికారం/వాంతులు, ఒళ్లు నొప్పులు, ఒంటి మీద ర్యాష్ వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కొన్ని హెచ్చరికలతో కనిపించే డెంగీ : పైన చెప్పిన లక్షణాలతో పాటు పొట్ట నొప్పి, ఊపిరితిత్తుల చుట్టూ ఉండే ప్లూరా అనే పొరలో లేదా పొట్టలో నీరు చేరడం. కొందరిలో పొట్ట లోపలి పొరల్లో రక్తస్రావం అవుతుండటం, బాధితులు అస్థిమితంగా ఉండటం, రక్తపరీక్ష చేయించినప్పుడు ఎర్ర రక్త కణాలకూ, మొత్తం రక్తం పరిమాణానికి ఉన్న నిష్పత్తి కౌంట్ పెరగడంతో పాటు ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోతుంది.

తీవ్రమైన డెంగీ (సివియర్ డెంగీ) కేసుల్లో : అంతర్గత అవయవాల్లో రక్తస్రావం కారణంగా బాధితుడు తీవ్రమైన షాక్‌కు గురవుతాడు. ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాసప్రక్రియకు అంతరాయం ఏర్పడుతుంది. తీవ్ర రక్తస్రావంతో బాధితుడు స్పృహకోల్పోవచ్చు లేదా పాక్షిక స్పృహలో ఉండవచ్చు. మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో కీలకమైన అవయవాలు పనిచేయకుండా పోవచ్చు.

నిర్ధారణ పరీక్షలు :

● సీబీపీ ప్రతి 24 గంటలకు ఒకసారి చేయాలి. ● నిర్ధారణ కోసం డెంగీ ఎన్ఎస్1 యాంటీజెన్ పరీక్ష అవసరం కావచ్చు.

● డెంగీ ఐజీఎమ్ అనే పరీక్ష కూడా చేయాలి. కొన్ని అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ రిపోర్టులు వచ్చేందుకు పట్టే సమయం కూడా ఎక్కువే కాబట్టి డాక్టర్లు అవి వచ్చే వరకు ఆగకుండా... లక్షణాలను బట్టి చికిత్స అందించడం ప్రారంభిస్తారు.

● పై పరీక్షలతో పాటు ఇప్పుడు ఐపీఎఫ్ (ఇమ్మెచ్యూర్ ప్లేట్‌లెట్ ఫ్రాక్షన్) అనే అత్యాధునిక పరీక్ష అందుబాటులో ఉంది. ఇది ప్లేట్‌లెట్లను ఎప్పుడు, ఎంత పరిమాణంలో ఎక్కించాలో తెలుసుకోవడంతో పాటు మరెన్నో అంశాలు తెలుసుకోడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.



టీకా ఉందిగానీ...

ప్రస్తుతం డెంగీకి టీకా (వ్యాక్సిన్) అందుబాటులో ఉన్నప్పటికీ ఇది అందరూ తీసుకునే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. గతంలో ఓసారి డెంగీకి గురైన వారికి మాత్రమే టీకా ఇవ్వాలి. ఎందుకంటే రెండోసారి వచ్చే డెంగీ రావడం రావడమే చాలా ప్రమాదకరంగా ఉండి ప్రాణాపాయమూ కల్పించవచ్చు. కాబట్టి ఆ పరిస్థితిని నివారించేందుకు ఒకసారి డెంగీ వచ్చినవారికి మాత్రమే టీకా ఇస్తారు.



డా॥ రవీంద్ర కుమార్
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్

డెంగీలో మరింత ప్రమాదకరమైన కొన్ని లక్షణాలివి...

● ప్లేట్ లెట్స్ తక్కువ కావడంతో అంతర్గత అవయవాలలోకి రక్తస్రావం అయ్యే ప్రమాదంతో పాటు ఒంట్లోకి నీరు చేరడం, సివియర్ డీహైడ్రేషన్‌కు గురికావడం జరగవచ్చు. ● కొందరిలో హీమోగ్లోబిన్ కాన్సంట్రేషన్ పెరుగుతుంది. హెమటోక్రిట్ పెరుగుతుంది. దీనివల్ల రక్తం గడ్డకట్టదు. రక్తపోటు పడిపోతుంది. లివర్ ఎన్‌లార్జ్ అయి, అది దెబ్బతినే ప్రమాదముంటుంది. గుండెస్పందనలు నిమిషానికి 60 కంటే తక్కువకు కూడా పడిపోవచ్చు. ఇలా గుండె స్పందనలు తగ్గినప్పుడు బాధితుల్ని ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచాల్సి వస్తుంది. బ్లీడింగ్, ఫిట్స్ వల్ల మెదడు దెబ్బతినే ప్రమాదమూ ఏర్పడవచ్చు. వ్యాధినిరోధక వ్యవస్థ (ఇమ్యూన్ సిస్టమ్) పూర్తిగా దెబ్బతినడానికీ అవకాశముంది.

నివారణ ఇలా...

అన్ని వ్యాధుల్లోలాగే డెంగీలోనూ చికిత్స కంటే నివారణ ఎంతో మేలు. డెంగీని కలిగించే టైగర్ దోమ పగటిపూటే కుడుతుంది. దీని సంతానోత్పత్తి మంచి నీటిలోనే. ఈ ప్రక్రియకు పదిరోజుల వ్యవధి పడుతుంది. కాబట్టి వారంలోని ఏదో ఒక రోజు ఇంటిలోని నీటిని పూర్తిగా ఖాళీ చేసి డ్రై డే గా పాటిస్తే, దీని జీవితచక్రానికి విఘాతం కలిగి ప్రత్యుత్పత్తికి అంతరాయం ఏర్పడుతుంది.

● ఇళ్ల మూలలూ, చీకటి, చల్లటి ప్రదేశాలే టైగర్ దోమల ఆవాసం. ఇల్లంతా వెలుతురు, సూర్యరశ్మి ధారాళంగా వచ్చేలా చూసుకోవడంతో పాటు, దోమలు రాకుండా తలుపులకు, కిటికీలకు మెష్ అమర్చుకుంటే...ఒక్క డెంగీ దోమలే కాకుండా...మలేరియా, ఇతర వ్యాధులకు గురి చేసే దోమల్నీ నివారించినట్లు అవుతుంది.

● టైగర్ దోమ పెద్దగా ఎత్తుకు ఎగరలేదు. అందువల్ల కాళ్లు పూర్తిగా కప్పి ఉంచే దుస్తులతో, ఫుల్‌స్లీవ్‌తో చాలావరకు రక్షణ కలుగుతుంది. ● నిల్వ నీటిలోనే దోమ గుడ్లు పెడ్తుంది కాబట్టి కొబ్బరి చిప్పలు, డ్రమ్ములు, బ్యారెల్స్, టైర్లు, కూలర్లు, పూలకుండీల కింద పెట్టే ప్లేట్లు మొదలైన వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. అలాగే వాడని డ్రమ్ముల్ని బోర్లించి ఉంచాలి.

● దోమలను తరిమివేసేందుకు మస్కిటో రిపెలెంట్స్ వాడవచ్చు.

డెంగీ వస్తే ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. కొందరిలో మినహాయించి అది అందరిలోనూ ప్రమాదకరం కాదు. కాకపోతే గర్భిణులు, చిన్నారులు, పెద్దవయసు వారికి డెంగీ సోకినప్పుడు అది తగ్గేవరకు జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది.

చికిత్స...

డెంగీ అన్నది వైరస్ కారణంగా వచ్చేది కాబట్టి దీనికి నిర్దిష్టంగా మందులేమీ ఉండవు. అందువల్ల లక్షణాలకు మాత్రమే చికిత్స (సింప్టమాటిక్ ట్రీట్‌మెంట్) ఇస్తారు. అంటే... అవసరమైనప్పుడు రక్తనాళం ద్వారా ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం, అవసరాన్ని బట్టి రక్తాన్ని, ప్లేట్‌లెట్స్‌ను, ప్లాస్మా ఎఫ్ఎఫ్‌పి (ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా) ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ ప్లేట్‌లెట్స్ కౌంట్ 20 వేల నుంచి 15 వేలు లేదా అంతకంటే తక్కువకు పడిపోతేనే ప్లేట్‌లెట్స్ ఎక్కించాలి.

పిన్‌వార్మ్ / థ్రెడ్ వార్మ్ ఇన్ఫెక్షన్ అంటే...?



కొందరు చిన్నారుల్లోని ప్రైవేట్ ప్రాంతాల్లో సన్నటి దారాల్లాంటి క్రిములు కనిపిస్తుంటాయి. మూత్ర ద్వారం నుంచి వస్తున్నట్లు కనిపించే ఇవి నిజానికి మల ద్వారం నుంచి వస్తుంటాయి. అవయవ నిర్మాణపరంగా (అనటామికల్‌గా) మూత్ర విసర్జన ప్రాంతం (యురెథ్రా)... మల ద్వారానికి దగ్గరగా ఉండటంవల్ల ఇవి మూత్ర ద్వారం నుంచి వస్తున్నట్లు అనిపిస్తుంటాయి. సన్నటి దారాల్లాంటి ఆకృతిని బట్టి వాటిని థ్రెడ్‌వార్మ్స్ లేదా పిన్‌వార్మ్స్ అంటారు. ఈ ఇన్ఫెక్షన్‌ను 'ఎంటిరోబియాసిస్' అని కూడా చెబుతారు.

యుక్తవయసుకు వచ్చిన (అడల్ట్) పిన్‌వార్మ్స్ పెద్ద పేగుల్లో నివాసముంటాయి. ప్రతి అడల్ట్ జీవి 10,000 గుడ్లు పెడుతుంది. రాత్రివేళల్లో ఆడ పిన్‌వార్మ్ పెద్దపేగు (కోలన్) నుంచి మలద్వారం (రెక్టమ్) ద్వారా బయటకు వచ్చి పిరుదుల ప్రాంతంలో గుడ్లను వదిలేస్తుంది. ఆ గుడ్లు పిరుదుల మీద, మలద్వారం పరిసరాల్ని అంటిపెట్టుకుని ఉంటాయి. కొన్ని గుడ్లు గాల్లోకి కూడా వ్యాపిస్తాయి. వాటి నుంచి బయటకు వచ్చిన లార్వాలు బయటకు పిరుదులు, మలద్వారం, మూత్రద్వారం దగ్గర తచ్చాడుతుంటాయి. దురద కారణంగా పిల్లలు అక్కడ గీరుకున్నప్పుడు అవి గోళ్లలోకి చేరుతాయి. అవే చేతుల్ని నోట్లో పెట్టుకున్నప్పుడు అవి కడుపులోంచి మళ్లీ పెద్ద పేగుల్లోకి చేరి... ఇలా జీవిత చక్రాన్ని కొనసాగిస్తుంటాయి. వాటి లైఫ్ సైకిల్ పూర్తి కావడానికి 4-6 వారాలు పడుతుంది.

వ్యాప్తి ఇలా...

పిల్లలు ఆడుకునే బొమ్మలు, బెడ్ షీట్స్, తువాళ్లు, లోదుస్తులు, టాయిలెట్ సీట్స్ ద్వారా తేలిగ్గా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. మరీ చిన్నపిల్లల్లో వాడిన డయపర్స్‌ను పెద్దలు ముట్టుకున్న తర్వాత వేరే పిల్లలను పట్టుకున్నప్పుడు కూడా వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. అయితే ఈ పిన్‌వార్మ్ ఇన్ఫెక్షన్ పెంపుడు జంతువుల (పెట్స్) ద్వారా ఇతరులకు వ్యాపించదు.

నివారణ చర్యలివి...

● పిల్లలకు ప్రతిరోజూ రెండుపూటలా స్నానం చేయించాలి. ● పిల్లలు తరచూ చేతులు శుభ్రంగా కడుక్కునేలా తల్లిదండ్రులు అలవాటు చేయాలి. ముఖ్యంగా మలవిసర్జన తర్వాతా, మట్టిలో ఆడిన తర్వాత పిల్లలు శుభ్రంగా చేతులు కడుక్కునేలా చూడాలి. ● పిల్లల గోళ్లు ఎక్కువగా పెరగకుండా వాటిని ఎప్పటికప్పుడు కత్తిరిస్తుండాలి. ● పిల్లలు తమ గోళ్లు కొరక్కుండా చూడాలి. గోళ్లు కొరికే అలవాటు ఉంటే మాన్పించాలి. ● ఇంట్లో ఎవరికైనా పిన్‌వార్మ్ ఇన్ఫెస్టేషన్ ఉంటే వాళ్లతో పాటు మిగతావాళ్లూ చికిత్స తీసుకోవాలి. లేకపోతే ఇది తరచూ తిరగబెడుతుండే అవకాశాలు ఎక్కువ.

చికిత్స... మెబెండజోల్, ఆల్బెండజోల్, పెరెంటల్ పాల్మొయేట్ అనే మందుల్ని తగిన కోర్సులుగా ఇవ్వడం ద్వారా దీన్ని పూర్తిగా నయం చేయవచ్చు.

పిల్లల్లో పొరబోయిందా? గొంతులో ఏదైనా ఇరుక్కుందా?



పిల్లలు తినే సమయంలో వారి గొంతులో ఏదైనా ఇరుక్కున్నపుడు పొర పోయిందని పెద్దలు అంటుంటారు. తిన్న ఆహారం కిందికి కదలడం కోసం తలపై తడుతుంటారు. కానీ గొంతులో ఇరుక్కున్న ఆహారంగానీ లేదా నాణెంలాంటి వస్తువుగానీ ఊపిరితిత్తుల్లోకి వెళ్లే వాయునాళంలోకి పోతే చాలా ప్రమాదం. ఇలా ఆహారం ఇరుక్కున్నా లేదా ఏదైనా వస్తువు గొంతులో ఇరుక్కున్నా హాస్పిటల్‌కు వెళ్లేలోపు ఈ కింద పేర్కొన్న సూచనలు పాటించాలి.

● పిల్లల నోరు బాగా తెరిపించి, నాలుక బాగా చాపేలా చేసి, గొంతులోకి వేళ్లుపోనిచ్చి చేతికి ఏదైనా తగులుతుందేమో చూడాలి. తగిలితే వెంటనే బయటకు తీసేయాలి. ● పిల్లాడి వెనక పెద్దలెవరైనా నిల్చుని, వారి రెండు చేతుల్నీ పొట్టచుట్టూ బిగించి, అకస్మాత్తుగా చేతుల్తో పట్టుబిగుస్తున్నట్లుగా కదిలించాలి. ఇది క్రమపద్ధతిలో (రిథమాటిక్‌గా) చేస్తుండాలి. దాంతో పొట్ట దగ్గర ఒత్తిడి పెరిగి, గొంతులో ఇరుక్కున్నది బయటకు రావచ్చు. దీన్ని హీమ్‌లిచ్ మెనోవర్ అంటారు.

● ఇదే గనక చాలా చిన్నపిల్లల్లో / పసిపాపల్లో చేయాల్సి వస్తే... పెద్దలు కుర్చీలో కూర్చుని, చిన్నారులు తలకిందులుగా ఉండేలా, వాళ్లను తమ కాళ్లపైన బోర్లా పడుకోబెట్టాలి. ఇలా పడుకోబెట్టాక, చిన్నారుల వీపుపై అకస్మాత్తుగా ఒత్తిడి కలిగేలా నొక్కాలి. ఇది ఎలా జరగాలంటే... చిన్నారుల నడుము నుంచి వారి రెండు భుజాల మధ్య ప్రాంతంలో మృదువుగా ఒత్తిడి కలిగేలా కదిలిస్తుండాలి. ఇది కూడా క్రమపద్ధతిలో (రిథమాటిక్‌గా) చేయాలి. ఒకవైపు పొట్ట మీద పెద్దల కాళ్ల ఒత్తిడీ, మరోవైపు వీపు మీద చేతుల ఒత్తిడి కారణంగా గొంతులో అడ్డు పడ్డ పదార్థం బయటకు వచ్చే అవకాశం ఉంది. ● ప్రథమ చికిత్సగా ఇవి చేస్తూ... వీలైనంత త్వరగా పిల్లల్ని హాస్పిటల్‌కు తరలించాలి. ఈ ప్రక్రియలతో గొంతులో ఇరుక్కున్నవి బయటకు వస్తే సరి. లేదంటే హాస్పిటల్‌లో అవసరాన్ని బట్టి ఎండోస్కోప్ వాడి, ఇరుక్కున్న పదార్థాన్ని డాక్టర్లు బయటకు తీస్తారు.